GLOBAL TELUGU CHRISTIAN MINISTRIES

# NEWS LETTER

For Private Circulation only November - December 2015

ప్రియనేస్తమా,

ప్రభువైన యేసు క్రీస్తు నామంలో మీకు శుభాలు. మీలో అనేకులు 'వల్డ్ తెలుగు క్రిస్టియన్ సమిట్ – జెరూసలేం 2015' కు హాజరైనందుకు సంతోషిస్తోన్నా.హోలీల్యాండ్ ట్రిప్ తర్వాత మీరంతా ఆరోగ్యంగా వున్నారనీ, మీ తీపి జ్ఞాపకాలు మీ ప్రియ కుటుంబాలతో, మిత్రులతో పంచుకొని దేవుని మహిమపరుస్తోన్నారనీ నమ్ముతోన్నాను. ఈ దీవెనకరమైన అనుభవాన్ని పొందడానికి ప్రభువు మిమ్మును ఎంచుకొన్నందుకు ఆయన్ను స్తుతిస్తూ, సహృదయతతో, ప్రార్ధనా సిద్ధపాటుతో పాల్గొన్న మిమ్మల్నందర్నీ జీటీసియెమ్ వ్యవస్థాపకులూ, అధ్యక్షులూ రెవ. డా.లివింగ్‌స్టన్ గద్దె గారి తరపున, నాయకులూ, బోర్డ్ సభ్యుల తరపున జీటీసియెమ్ ఎక్సేక్యుటివ్ డిరెక్టర్‌గా అభినందిస్తోన్నాను. నా ఆరోగ్యం కొంత ఇబ్బందిని కలుగ జేసినందువలన ఇంతకంటే ముందుగా మిమ్మును ఈ లేఖతో కలవలేకపోయినందుకు చింతిస్తోన్నాను. క్షంతవ్యుడను.

మన ప్రభువు నిశ్వసించిన ఊపిరిని ఉచ్ఛ్వసించే దీవెన మనకు కలిగింది. ఆయన అడుగు పెట్టిన స్థలాలను అలనాడు వెంబడించిన ప్రప్రథమ విశ్వాసులవలె మన పాదాలూ తాకాయి. మన విశ్వాసానికి పునాదులైన అనేక ప్రదేశాలనూ, వస్తువాహన సామగ్రినీ చూడ్డానికి మన కళ్ళు నోచుకొన్నాయి. ఈ అనుభవాలు మన సమర్పణా జీవితాన్ని మరింత ఉజ్జీవింపజేస్తాయని నేను భావిస్తోన్నాను. ఈజిప్ట్, పేలస్టైన్, ఇశ్రాయెల్, జోర్డాన్ దేశాల్లో పర్యటించి అనేకానేక ప్రదేశాలనూ, సంస్కృతినీ ఆస్వాదించడానికీ, నూతన ఆధ్యాత్మిక అనుభవాలను పొందుకోడానికి ప్రభువిచ్చిన కృపనుబట్టి ఆయనకే వందనాలు.

ప్రాముఖ్యంగా అతి ప్రతిష్ఠాత్మకమైన, చారిత్రాత్మకమైన, తెలుగు క్రైస్తవులెల్లరూ గర్వించదగిన 'వల్డ్ తెలుగు క్రిస్టియన్ సమిట్ – జెరూసలేం 2015' లో పాల్గొన్న మీకందరకూ నా అభినందన వందనాలు. ఇంతవరకూ నూట ఎనభయ్యారు మంది తెలుగు క్రైస్తవులు జెరూసలేంలో కూడి కాన్ఫరెన్స్ జరుపుకోడం, అంతమంది పాల్గొనడం చరిత్రలో ఇదే ప్రథమం. ఇండియా నుండి నూట ఆరుగురూ, సౌత్ అమెరికా మినహా అన్ని ఖండాలనుండీ మరో ఎనభై మందీ పాల్గొన్నారు. అక్టోబర్ 24, 25 తేదీల్లో జెరూసలేంలో జరిగిన రెండు రోజుల కాన్ఫరెన్స్ లో అమెరికాలో క్రియేషన్ మ్యూజియం నుండి వచ్చిన డా.క్రెండాల్, స్టీవ్ హేమ్‌లు ముఖ్య ప్రసంగీకులుగా విచ్చేసి అమూల్యమైన వర్తమానాలు అందించారు. జీటీసియెమ్ పూర్వ ఉపాధ్యక్షులు రెవ. పాల్ దేవకుమార్ గారు కూడా ప్రసంగించారు. రెవ. సుధాకర్ మొండితోక గారు, రెవ. డా. జాన్ సోమయ్య గారూ సందేశాలను తెలుగులోకి అనువదించారు. జీటీసియెమ్ ప్రస్తుత ఉపాధ్యక్షులూ, పేట్రన్ అయిన రెవ. డా. జోసఫ్ పాతూరి గారు రెండు దినాల సభలకూ అధ్యక్షత వహించారు.

డా. డేవిడ్ చిగురుపాటి (అమెరికా) నార్త్ అమెరికా మినిస్ట్రీ గూర్చి, రెవ. సలోమీ (లండన్) గారు యూరప్ మినిస్ట్రీ గూర్చి, రెవ. డా. జాన్ సోమయ్య గారు గల్ఫ్ మినిస్ట్రీ గూర్చి, బ్రదర్. ఎడ్వర్డ్ ఆలూరి ఓషేనియా (ఆస్ట్రేలియా) మినిస్ట్రీ గూర్చి, నేను ఇండియా మినిస్ట్రీ గూర్చి ప్రస్తావించాం. కొసమెరుపుగా ఇశ్రాయేల్ దేశపు టూరిజం మినిస్టర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఆర్కైవ్స్ ఎండ్ కల్చరల్ ఎఫైర్స్ రావడం, మన నాయకులను సత్కరించడం, జీటీసియెమ్‌కు ప్రభువిచ్చిన ప్రత్యేక ఆధిక్యత అని దేవుని స్తుతిస్తోన్నా. చెన్నై నుండి డా. శౌరి బాబు గారు ఈ ట్రిప్ మేనేజర్ గా వ్యవహరించడం స్పెషల్ బ్లెస్సింగ్‌గా భావిస్తోన్నా. దైవజనులు, డా. లివింగ్‌స్టన్ గద్దె గారు వారి జీవిత కాలంలో ప్రపంచవ్యాప్త తెలుగు క్రైస్తవులకు ఈ కానుకను అందజేయాలనే ఆశను ప్రభువు నెరవేర్చి తన సేవకుని సంతోషింప జేసినందుకు పవిత్రమైన ప్రతి ఆశనూ తీర్చి తృప్తిపరచే దేవాదిదేవునికి వందనాలు. ఈ ట్రిప్‌కు ముందు డా. లివింగ్‌స్టన్ గద్దె గారి ఆరోగ్య పరిస్థితి చాలా ఆందోళనకరంగా వున్నప్పటికీ వారు పాల్గొనే కృపను దయచేసిన దేవునికి వందనాలు.

నూట ఎనభైయ్యారు మంది తెలుగు క్రైస్తవులు పాల్గొన్న ఈ యాత్రలో కొన్ని స్వల్ప ఇబ్బందులనెదుర్కోవాల్సి వచ్చినప్పటికీ కేవలమూ అధిక సంఖ్యవలన మాత్రమే అట్టి పరిస్థితి కలిగిందని గుర్తించీ మంచి మనసుతో సహకరించిన పార్టిసిపేట్స్ అందరికీ జీటీసియెమ్ పక్షంగా నా కృతజ్ఞతలు.

జీటీసియెమ్ దర్శన భవిష్యత్తు మీ అందరి సహకారం మీదా ఆధారపడి ఉందని గుర్తుచేస్తూ, మీ మనఃపూర్వక ప్రోత్సాహం మాతో వుంటుందని ఆశిస్తాను. మీమీ సంఘాల్లో, పట్టణాల్లో 'ఆరోగ్యవంతమైన సంఘం' సెమినార్లు జరిపి మీవంతు అతి సమంజసమైన బాధ్యతగా సంఘాలకూ, సమాజాలకూ ఆశీర్వాదకారకులౌతారని జీటీసియెమ్ ఆశిస్తోంది. మమ్మల్ని సంప్రదించండి. మేం మీతో సహకరించి మనసంఘాలను ఆదిమ సంఘ విశ్వాసానుభవాలకు కేంద్రాలుగా మలచుకొందాం!

## మీ ప్రార్ధనలు మాకు అవసరం:

1. మన అధ్యక్షులు రెవ. డా. లివింగ్ స్టన్ గద్దె గారు కొంత అనారోగ్యానికి గురయ్యారు. దయచేసి ప్రార్ధించండి.
2. డబ్ల్యూటీసియెస్ – జెరూసలేం 2015కు హాజరైన వారిలో అనేకులు వారివారి ప్రాంతాల్లో జీటీసియెమ్ దర్శనాన్ని పరిచయం చేసేవారిగా ప్రభువు ఆత్మ చేత ప్రభావితులు కావాలని ప్రార్ధించండి.

**గమనించండి:** గల్ఫ్ నుండి 'వర్ల్డ్ తెలుగు క్రిస్టియన్ సమిట్ – జెరూసలేం 2015' వచ్చిన యదవ్ రత్న బజరంగిల్ అనే సహోదరి నన్ను కలసి తాను కేవలం ఒక హౌస్ మెయిడ్ గా పనిచేస్తోన్నాననీ, ఈలాంటి పరిచర్యలో ప్రార్ధనా సహకారంతో పాటు ఆర్ధిక సహకారాన్నందించడం ప్రాముఖ్యమనీ, తన వంతుగా ఏమైనా చేయాలని ఇష్టపడుతోన్నట్లు తెలియజేసారు. తన కొద్ది వనరులనుండి రూ. 12,000/– (పన్నెండు వేల రూపాయలు) పంపి తమ ప్రేమనూ, కర్తవ్యాన్ని వ్యక్తం చేశారు. వారికి మా హృదయ పూర్వక కృతజ్ఞతలు. ప్రభువు ఆమెను దీవించి అనేకులకు ఆదర్శప్రాయంగానూ, ప్రోత్సహకరంగానూ వుంచాలని ప్రార్ధిస్తోన్నాం. 'డబ్ల్యూటీసియెస్–లండన్ 2016' కొరకు ప్రార్ధించండి. పాల్గొనండి, మన ప్రియ సంఘాలను ప్రోత్సహించండి.

**ఆయా దేశాల్లో విస్తరించియున్న మీ తెలుగు బంధు మిత్రులకు జీటీసియెమ్ మీ కొరకేననీ, మీదేననీ చెప్పండి.**

**మీ కందరికి ప్రభువు దీవెనలు కాంక్షిస్తూ ...**

*మీతో జీటీసియెమ్ దర్శన దిశగా...*

**ప్రియనాథ్ రూఫస్,** ఎక్సెక్యూటివ్ డైరెక్టర్, జీటీసియెమ్

# డబ్ల్యూటీసియెస్ – జెరూసలేం 2015 ఫొటోస్




జీటీసీయెం విషెస్ యు హేపీ క్రిస్మస్ ఎండ్
ఎ బ్లెస్సెడ్ న్యూ ఇయర్ 2016

# బైబిల్ కాలం తర్వాత ఇశ్రాయేల్ చరిత్ర

**- ప్రియనాథ్ రూఫస్, రాజమండ్రి**

"యెరూషలేము యొక్క క్షేమము కొరకు ప్రార్థన చేయుడి. యెరూషలేమా, నిన్ను ప్రేమించువారు వర్ధిల్లుదురు. నీ నగరులలో క్షేమముండును గాక!" కీర్తన 122 : 6,7

బైబిల్ కాలం తర్వాత ఇశ్రాయేలు చరిత్రకు ఆధారం ఫలానా గ్రంథమని చెప్పడానికి వీలులేదు. ఇది మనకాల చరిత్ర గనుక అనేకులు రాసిన పుస్తకాలనూ, వ్యాసాలనూ అధ్యయనం చేసి, వాటి ప్రామాణికతను నిర్ధారించిన తర్వాతగానీ ఎడిట్ చేసుకోవడం వీలుకాదు. ఏమైనప్పటికీ, ఆసక్తి వుండాలేగాని బైబిల్ కాలం తరువాతి ఇశ్రాయేల్ చరిత్ర రసవత్తరంగా వుంటుంది. ఇందులో కేవలం చరిత్ర మాత్రమే కాకుండా మిస్టరీస్ వుంటాయి. ఎందుకిలా జరిగింది అనే ప్రశ్నకు జవాబు దొరకదు. ఇశ్రాయేల్ దేవుణ్ణి గూర్చి కాస్త అవగాహన వున్న వారు మధ్యమధ్యలో కొన్ని ఘట్టాలను దైవకార్యాలుగా గ్రహించగలరు. దేవుడు తన జనాంగమును ఎన్నడూ విడిపెట్టలేదనే వాస్తవం అర్థమౌతుంది. క్రీ.శ. 70 నుండి ప్రపంచంలో జరిగిన అనేక యుద్ధాలతో యూదా చరిత్ర పెనవేసుకొని వుంటుంది. ఈ దేశం కేవలం 23000 చదరపు మైళ్ళ భూభాగం మాత్రమే. కానీ ప్రపంచ చరిత్రలో ఇది ఒక కీలకమైన పాత్రను పోషిస్తుంది. అనేకమంది రాజులూ, సామ్రాజ్యాలూ ఈ చరిత్ర కథలో తమ పుటలను శాశ్వతంగా భద్రపరచుకొన్నారు.

**1. రోమన్ల కాలం (క్రీ.శ. 70-325):** యేసు క్రీస్తు తరువాత క్రీ.శ 36లో పైలేట్ రోమ్‌కు పిలవబడి గాల్ దేశంలో దేశబహిష్కృతుడుగా చేయబడి ఆత్మహత్య చేసుకొన్నాడు. 36లో పైలేట్, హేరద్ ద గ్రేట్ లు తొలగింపబడి హేరద్ అగ్రిప్పకు రాజ్యాధికారం ఇవ్వబడింది. హేరద్ అగ్రిప్ప దేవదూషణ చేసి మరణించాడు (అపోస్తలుల కార్యములు 12:20-23). అగ్రిప్ప తర్వాత ఫెలిక్స్, ఫెస్టస్ రాజ్యానికి వచ్చారు (అ.కా. 24 - 26). తరువాత వీరు కూడా పదవీచ్యుతులై వారి స్థానే ఫ్లోరస్ అనే రోమన్ గవర్నర్ నియమింపబడ్డాడు. ఫ్లోరస్ అకృత్యాలకు తట్టుకోలేని యూదులు 65 లో దేవాలయ రక్షణాధికారి ఎలియజర్ నాయకత్వంలో "జీలట్స్" అనే విప్లవ సంస్థగా తయారై తిరుగుబాటుచేసి, రోమన్ ఆంటోనియా కోటను పట్టుకొని రోమన్ గార్డ్‌ను చంపేశారు. దీని పర్యవసానంగా 66లో సిరియాలోనున్న రోమన్ మిలిటరీ జనరల్ సెస్టియస్ 23000 సైనికులతో జెరూసలేంను ముట్టడించి, ఆరు మాసాల తర్వాత తిరిగి సిరియాకు ప్రయాణమయ్యాడు. సిటీ గేట్స్ తెరుచుకొని యూదులు ఒక్క ఉదుటన వచ్చి 6000 మంది రోమన్ సోల్జర్స్ ను హతమార్చి ఆయుధాలు చేజిక్కించుకొన్నారు. దీనితో రోమన్స్ ను ఎదుర్కోగలమనే ధైర్యం యూదులకు కలిగింది. ఈ సమయంలో జెరూసలేంలో క్రైస్తవులు మాత్రం పెరయకు పోయి తలదాచుకొన్నారు. రోమన్ చక్రవర్తి నీరో తమ రోమ్ సైనికులు పారిపోతోన్నారనే విషయం తెలిసి 68లో వెస్పేషియన్ అనే మరో జనరల్‌ను 60,000 మంది సైనికులతో పంపాడు. వెస్పేషియన్ తన కుమారుడు టైటస్‌తో పాటు జెరూసలేం మీదికి దండెత్తి అనేకమైన యూదా పట్టణాలను నాశనం చేసి, అనేకమందిని బందీలుగా తీసుకుపోయాడు. ఈ సంఘటనలో జ్యూయిష్ చరిత్రకారుడు జోసీఫస్ కూడా పట్టబడ్డాడు. ఇంతలో రోమ్‌లో చక్రవర్తి నీరో ఆత్మహత్య చేసుకోవడం, తిరుగుబాటు జరగడం, వెస్పేషియన్ 69లో చక్రవర్తి కావడం జరిగిపోయాయి. మరుసటి సంవత్సరం అనగా 70లో వెస్పేషియన్ జనరల్ టైటస్‌ను జెరూసలేం పంపాడు. టైటస్ జెరూసలేంపై దండెత్తి నగరాన్ని ధ్వంసం చేశాడు. దేవాలయాన్ని తగలబెట్టాడు, భవనాలను కూల్చేశాడు. సుమారు పది లక్షలమంది యూదులు అగ్నికి, సిలువ మరణానికి, రోమన్ కత్తికి ఆహుతులైపోయారు. మత్తయి 24లో యేసు చెప్పిన ప్రవచనం అక్షరాలా నెరవేరింది.

130లో చక్రవర్తి హాడ్రియన్ జెరూసలేం పునర్నిర్మించడానికి పూనుకొన్నాడు. సోలమన్ టెంపుల్ స్థానంలో రోమన్ దేవుడు జూపిటర్‌కు ఒక దేవాలయం నిర్మించాడు. యూదులు దీనిని సహించలేకపోయారు. 132లో బార్ కోచ్బా అనే యూద యోధుడు ప్రముఖ యాజకుడు రబ్బై అకీబాను సంప్రదించాడు. అకీబా బార్ కోచ్బాయే రాబోయే మేస్సీయ అనుకొన్నాడు. ఇరువురు కలిసి 2,00,000 మంది యూదులను ఏర్పరచుకొని తిరుగుబాటు బావుటా ఎగరేశారు. వీరితో చేరిన యూదులు బార్ కోచ్బా ప్రకటించిన నియమాన్ని బట్టి చేతి వ్రేళ్లలో ఒక దానిని నరికివేసుకొన్నారు. త్వరలోనే 50 రోమన్ స్థావరాలనూ, 1000 గ్రామాలనూ రోమన్స్ నుండి విడిపించాడు. కానీ రోమన్ జనరల్ జూలియస్ సెవరస్ తిరుగుబాటునణచి బార్ కోచ్బాను చంపి, యాజకుడు రబ్బై అకీబాను సజీవంగానే చర్మాన్ని చీరేశాడు. సుమారు 500000 మంది యూదులు చంప బడ్డారు. క్రీ.శ. 135 నుండి 1948 వరకు జెరూసలేం యూదుల వశం కాలేదు. అప్పటి నుండి 325 వరకూ రోమన్స్ ఇశ్రాయేల్ (పలేస్తైన్) ను పరిపాలించారు. ఈ కాలంలో మిగిలిన యూదులు తమ మతానికి టైబెరాను కేంద్రం చేసుకొన్నారు.

**2. బైజాంటైన్ కాలం (325 - 614):** కాన్స్టంటైన్ చక్రవర్తి సులభతరమైన పరిపాలన నిమిత్తం తన సామ్రాజ్యం తూర్పు భాగానికి ముఖ్యపట్టణాన్ని రోమ్ నుండి కాన్స్టాంటినోపుల్‌కు తరలించాడు. కాన్స్టాంటినోపుల్‌కు మరో పేరు బైజాంటైన్. ఈ కాలంలో చక్రవర్తి ఆదరణకు నోచుకొన్న క్రైస్తవ్యం తూర్పు దేశాల్లో త్వరగా విస్తరించింది. పలేస్తీన్ అభివృద్ధి చెందింది. క్రైస్తవ దేవాలయాలు నిర్మితమయ్యాయి. ఈ కాలంలోనే క్రైస్తవులు యూదులను హింసించడం కూడా జరిగింది. కాన్స్టంటైన్ తరువాత రాజైన జూలియస్ క్రైస్తవ్యాన్ని అసహ్యించుకొన్నాడు. యూదులను ప్రోత్సహించడానికి జెరూసలేం దేవాలయాన్ని పునర్నిర్మించ తలపెట్టాడు. పునాదులు త్రవ్వేటప్పుడు వాటిలోంచి పెద్ద మంటలు చెలరేగి పనివారిని, నిర్మాణకులను భీతావహులను చేశాయి. బహుశా ఈ మంటలు భూమిలో నిక్షిప్తమైన గ్యాస్ పనివారి దీపాలను తాకినందువలన చెలరేగి ఉండొచ్చు. కానీ సైన్స్ డివేలప్ కాని ఆ రోజుల్లో ఇది దైవకార్యమని భావించి నిర్మాణ ప్రణాళికను నిలిపివేశారు. ఏమైనప్పటికీ బైజాంటైన్ కాలంలో యూదులు క్రీ.పూ. 70లో దేవాలయం శిథిలమైన దినం సెప్టెంబర్ 8 గనుక ఆ దినం తప్ప మరెన్నడూ జెరూసలేంకు అనుమతించబడలేదు. పద్దెనిమిది నెలల పాలన తరువాత జూలియస్ యుద్ధంలో మరణించాడు.

*(సశేషం)*

# జీటీసీయెం ద్వారా లభ్యమౌతోన్న పుస్తకాలు




## బాలల బైబిలు

264 పేజీలు - పేపర్ బ్యాక్
విడిప్రతి రూ. 100.00
బుక్ షాప్ డిస్కౌంట్ 25%
(50 పుస్తకాలు, ఆపైన)




320 పేజీలు - పేపర్ బ్యాక్
విడిప్రతి రూ. 125.00
బుక్ షాప్ డిస్కౌంట్ 30% (25 పుస్తకాలు, ఆపైన)
ఇండివిడ్యువల్స్ డిస్కౌంట్ 15% (10 పుస్తకాలు, ఆపైన)




పేజీలు : 120
ముఖ వెల : రూ. 40.00,
జి.టి.సి.యం. మీకు అందజేస్తోన్న
వెల విడిప్రతి రూ. 30.00
బల్క్ఆర్డర్ (పది ఆపైన) రూ. 25.00




పేజీలు: 1550
పుస్తక వెల 275.00
(విడి ప్రతి)
బల్క్ఆర్డర్ (పది ఆపైన)
రూ. 225.00




పేజీలు: 56
పుస్తక వెల 30.00
బుక్ షాప్ డిస్కౌంట్ 30%
(25 పుస్తకాలు, ఆపైన)
ఇండివిడ్యువల్స్ డిస్కౌంట్
15% (10 పుస్తకాలు, ఆపైన)




పేజీలు: 55
పుస్తక వెల 25.00
బుక్ షాప్ డిస్కౌంట్ 30%
(25 పుస్తకాలు, ఆపైన)
ఇండివిడ్యువల్స్ డిస్కౌంట్
15% (10 పుస్తకాలు, ఆపైన)

నూతన సంవత్సరంలో మరోమారు కలసికొనే వరకు ఒకరినిమిత్తం ఒకరం ప్రార్థించుకొందాం.
దేవుని కృప మీకు తోడైయుండి ఆశీర్వదించును గాక.

క్రీస్తులో మీ సహదాసుడు **ప్రియనాథ్ రూఫస్,** ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్
ఫోన్ : 0949408413, 09397904895 ఈ మెయిల్ : rufus1410@gmail.com
**జి.టి.సి.ఎం. అడ్రస్ :** 11-115, చాపరాల వారి వీధి, అశోక్ నగర్, విజయవాడ-520007. ఫోన్: 0866-2555687. మేనేజర్: 98660 83001